ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.107.46 కోట్లు విడుదల

అనకాపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి నెలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం రూ.107.46 కోట్లు విడుదల చేసిందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శచీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,56,272 మంది లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు శనివారం అందజేయనున్నట్టు పేర్కొన్నారు. సచివాలయాల సిబ్బంది శుక్రవారం బ్యాంకుల నుంచి పింఛన్ సొమ్ము డ్రా చేసుకొని ఒకటో తేదీన పంపిణీ చేస్తారని ఆమె వెల్లడించారు.

ఓటెత్తిన ఉపాధ్యాయులు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 92.4 శాతం పోలింగ్

- అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 96.22 శాతం, అతి తక్కువగా విశాఖ జిల్లాలో 87.34 శాతం


ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలట్ బాక్సులను భద్రపరిచిన ఏయూలోని స్ట్రాంగ్ రూమ్‌కు సీలు వేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంఎన్ హరేంధిర ప్రసాద్


అనకాపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న ఉపాధ్యాయులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ పోలింగ్ నమోదైంది. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా, 20,783 మంది (92.4 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 13,508 మందికి 12,557 మంది, మహిళలు 8,985 మందికి 8,226 మంది ఓటు వేశారు. అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 2,885కి 2,776 (96.22 శాతం) మంది ఓటు వేయగా, అతి తక్కువగా విశాఖ జిల్లాలో 5529కి 4,829 మంది (87.34 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 5,035కి 4,769 (94.72 శాతం), పార్వతీపురం మన్యంలో 2,333కి 2,187 (93.74 శాతం), విజయనగరం జిల్లాలో 5,223కి 3,912 (94.05 శాతం), అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,488కి 1,310 (88.04 శాతం) మంది ఓటు వేశారు. ఆరు జిల్లాల పరిధిలో ఉదయం పది గంటలకల్లా 21.74 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 57.71 శాతం, రెండు గంటలకు 79.54 శాతం ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసేసరికి 92.4 శాతానికి చేరింది. ఆరు జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. కాగా 2019లో జరిగిన ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ జరిగింది. ఈ పర్యాయం 2.4 శాతం ఎక్కువగా ఓట్లు పోలైనట్టు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 96.22 శాతం పోలింగ్

- మొత్తం ఓటర్లు: 2,885
- పోలైన ఓట్లు : 2,775
- పురుషులు: 1,718 మంది, మహిళలు 1,057 మంది
- చీడికాడ, రోలుగుంట, మాకవరపాలెం, ఎస్.రాయవరంలో శత శాతం పోలింగ్

అనకాపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 2,885 మంది ఉపాధ్యాయ ఓటర్లకుగాను 2,775 మంది (96.22 శాతం) తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 1,718 మంది పురుషులు, 1,057 మంది మహిళలు ఉన్నారు. పాయకరావుపేటలోని 102వ పోలింగ్ కేంద్రంలో మట్టా గణేశ్ అనే పీఈటీకి ఓటు వుంది. అయితే తొలుత మట్లా గణేశ్ అనే మరో పీఈటీ ఉపాధ్యాయుడు (వాస్తవంగా ఇతని ఓటు నమోదు కాలేదు) వచ్చి ఓటు వేసి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తరువాత మట్టా గణేశ్ అనే పీఈటీ వచ్చారు. అప్పటికే ఓటు వేసినట్టు పోలింగ్ సిబ్బంది చెప్పడంతో ఐడీ కార్డు తీసి చూపించారు. పొరపాటు జరిగినట్టు గుర్తించిన పోలింగ్ సిబ్బంది.. మట్టా గణేశ్‌కు టెండర్ ఓటు హక్కు కల్పించారు. ఓటర్ల లిస్టులో పేరు లేకపోయినా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేసిన వ్యక్తిని సీసీ కెమెరాలో గుర్తించి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని పోలింగ్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

కాగా జిల్లాలో చీడికాడ, రోలుగుంట, మాకవరపాలెం, ఎస్.రాయవరం పోలింగ్ కేంద్రాల్లో శత శాతం ఓటింగ్ నమోదైంది. కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పలు పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించారు. పోలింగ్ ముగిసిన తరువాత అన్ని కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను గురువారం రాత్రి అనకాపల్లిలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల(మెయిన్)కు చేర్చారు. డీఆర్వో ... మిగతా 6వ పేజీలో

మండలాల వారీగా ఓటింగ్ వివరాలు

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
అనకాపల్లి	582	555	95.36
కశింకోట	84	83	98.8
పరవాడ	84	80	95.24
సబ్బవరం	94	93	98.93
ఎలమంచిలి	180	167	92.77
మునగపాక	44	41	93.18
రాంబిల్లి	26	25	95.15
అచ్యుతాపురం	73	71	97.26
మాడుగుల	55	53	96.36
కె.కోటపాడు	107	102	95.33
దేవరాపల్లి	63	62	98.41
చీడికాడ	85	85	100
చోడవరం	306	296	96.73
రోలుగుంట	48	48	100
బుచ్చెయ్యపేట	34	33	97.06
రావికమతం	52	51	98.07
పాయకరావుపేట	170	162	95.29
నక్కపల్లి	52	51	98.07
కోటవురట్ల	81	78	96.29
ఎస్.రాయవరం	81	81	100
నర్సీపట్నం	417	397	95.2
నాతవరం	71	69	97.18
గొలుగొండ	80	78	97.5
మాకవరపాలెం	53	53	100


అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్న కృష్ణాదేవిపేట జూనియర్ కళాశాల

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఒకటిన ఫస్టియర్, మూడున సెకండియర్ ప్రారంభం

- ఏర్పాట్లు పూర్తి
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

అనకాపల్లి, ఫిబ్రవరి 27: (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటో తేదీన ఫస్టియర్, మూడో తేదీన సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. సాధారణ, ఒకేషనల్ కోర్సులకు కలిపి ఫస్టియర్ పరీక్షలకు 12,936 మంది, సెకండియర్ పరీక్షలకు 13,225 మంది.. మొత్తం 26,161 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు

గత అనుభవాల దృష్ట్యా జిల్లాలో దేవరాపల్లి, కృష్ణాదేవిపేట పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక నిఘా కోసం అధికారులను నియమించారు. పోలీసులు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తారు. కాపీయింగ్, ఇతర అక్రమాలు, అవకతవకలకు అవకాశం లేకుండా ప్రతి పరీక్షా కేంద్రానికి ఇద్దరు చొప్పున చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లను నియమించారు. ఒక సీనియర్ లెక్చరర్, పీడీలతో కలిసి రెండు సిట్టింగ్ స్క్వాడ్ బందాలను ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ నుంచి ఒక ఏఎస్ఐ, రెవెన్యూ శాఖ నుంచి ఒక డిప్యూటీ తహసీల్దారు, సీనియర్ లెక్చరర్‌తో కూడిన ముగ్గురు సభ్యులతో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్షల నిర్వహణకు 450 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనిచేస్తాయి.

గంట ముందే కేంద్రాలకు రావాలి

విద్యార్థులు గంట ముందే.. అంటే ఉదయం ఎనిమిది గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి (డీవీఈఓ) సుజాత చెప్పారు. 8.30 గంటల నుంచి పరీక్ష హాలులోకి విద్యార్థులను అనుమతిస్తారని పేర్కొన్నారు. సెల్ ఫోన్‌లు, క్యాలిక్యులేటర్లు, ఇతర డిజిటల్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేది లేదన్నారు. సిబ్బంది సైతం పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. ఇంటర్ బోర్డు అందించిన కీప్యాడ్ ఫోన్‌లను మాత్రమే సూపరింటెండెంట్ తీసుకెళ్లేందుకు అనుమతి ఉందన్నారు.

పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రంతా జాగరణ చేసిన భక్తులు గురువారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించేందుకు సమీపంలోని సముద్రం, నదులు, జలాశయాలకు పోటెత్తారు. నక్కపల్లి మండలంలో బోయపాడు, రాజయ్యపేట, పాయకరావుపేట మండలం పెంటకోట, వెంకటనగరం, రాజవరం, రాజానగరం, రత్నయ్యమ్మపేట, పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, రాంబిల్లి మండలం వాడపాలెం, కొత్తపట్నం, లోవపాలెం, వెంకయ్యపాలెం, అచ్యుతాపురం మండలం పూడిమడక, తంతడి, పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం వద్ద సముద్ర తీరాల్లో పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆయా ప్రాంతాలు కోలాహలంగా మారాయి. రావికమతం మండలం కల్యాణపులోవకు భక్తుల తాకిడి పెరిగింది. రెండో రోజైన గురువారం లక్ష మందికిపైగా భక్తులు వచ్చారు. పలువురు భక్తులు జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. సమీపంలో వున్న ఆలయంలో పోతురాజుబాబు, పెద్దింటమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టం వద్ద ఉత్తర వాహిని (వరహా నది)లో పుణ్య స్నానాలు చేశారు. అనంతరం త్రిశూల పర్వతశ్రేణిపై కొలువై ఉన్న బ్రహ్మలింగేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు, అభిషేకాలు చేశారు.


నక్కపల్లి మండలం బోయపాడు సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


రావికమతం మండలం కల్యాణపులోవ జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఘనంగా నూకతాత జాతర


భక్తులపై నడిచివెళుతున్న నూకతాత పూజారులు

నక్కపల్లి మండలం రాజయ్యపేటలో మత్స్యకారుల ఆరాధ్య దైవమైన నూకతాత జాతరను గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సముద్ర తీరం ప్రధాన రహదారి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర భక్తులు రోడ్డుపై శయనించగా, నూకతాత పూజారులు వారి మీదుగా నడుచుకుంటూ వెళుతూ ఆశీర్వదించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23 మందికి జరిమానా, 8 మందికి జైలు శిక్ష

ఎలమంచిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రాఫిక్, రూరల్ పోలీస్ స్టేషన్ల 31 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి గురువారం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్టు పోలీసులు తెలిపారు. వీరిలో 23 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఎనిమిది మందికి నాలుగు రోజులపాటు జైలు శిక్ష విధించినట్టు చెప్పారు.

రోడ్డెక్కిన చెరకు రైతు

గోవాడలో మరోసారి క్రషింగ్ నిలిచిపోవడంతో ఆగ్రహం

- ప్రధాన రహదారిపై బైఠాయింపు.. స్తంభించిన ట్రాఫిక్
- పోలీసులు వచ్చి నచ్చజెప్పడానికి ప్రయత్నం
- ఫ్యాక్టరీ ఎండీ వచ్చి సమాధానం చెప్పాలని రైతులు డిమాండ్
- పోలీసుల రక్షణ మధ్య రైతుల వద్దకు వచ్చిన ఎండీ, అధికారులు
- క్రషింగ్‌ను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నట్టు వెల్లడి
- మరింత ఆగ్రహంతో ఎండీపై దాడికి యత్నించిన రైతులు
- నిలువరించిన పోలీసులు.. సీఐ హామీతో ఆందోళన విరమణ
- 20 గంటల తరువాత చెరకు క్రషింగ్ పునరుద్ధరణ
- రైతుల ఆందోళనపై అనకాపల్లి ఆర్డీవో విచారణ


ఫ్యాక్టరీ వద్ద చెరకు బండ్లతో ఆందోళనకు దిగిన రైతులు


ఎండీ సన్యాసినాయుడును నిలదీస్తున్న రైతులు

చోడవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి నుంచి క్రషింగ్ నిలిచిపోవడంతో గురువారం ఉదయం రైతులు ఫ్యాక్టరీ ఎదుట ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో అనకాపల్లి-చోడవరం మార్గంలో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందు కున్న పోలీసులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. ఎండీ, ఇతర అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు. కొద్దిసేపటి తరువాత పోలీసుల భద్రత నడుమ ఎండీ సన్యాసినాయుడు వచ్చారు. క్రషింగ్ ఆగిపోవడానికిగల కారణాలను ఆయన వివరించబోగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆయనపై దాడి చేయబోయారు. దీంతో ప్రాణ భయంతో ఫ్యాక్టరీలోకి పరుగులు తీశారు. క్రషింగ్‌ను సత్వరమే పునరుద్ధరించేలా చూస్తామని సీఐ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో ఫ్యాక్టరీలో క్రషింగ్ పునఃప్రారంభమైంది. దీనికి సంబంధించి వివరాలిలా వున్నాయి.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఇటీవల కాలంలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడం, బగాస్ నిల్వలు కొరతతో చెరకు క్రషింగ్ ... మిగతా 6వ పేజీలో



రైతుల ఆందోళనతో నిలిచిపోయిన వాహనాలు

రోడ్డెక్కిన చెరకు రైతు

... 5వ పేజీ తరువాయి

నిలిచిపోతున్నది. దీంతో ఫ్యాక్టరీ యార్డులో, కాటాల వద్ద చెరకు బండ్లు, ట్రాక్టర్లు రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. ఫ్యాక్టరీ యాజమాన్యం తీరుపై రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో టర్బయిన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యతో మరోసారి క్రషింగ్ నిలిచిపోయింది. ఫ్యాక్టరీ యార్డులో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో చెరకు తీసుకువచ్చిన రైతులు రాంత్రంగా జాగారం చేయాల్సి వచ్చింది. గురువారం ఉదయానికి కూడా క్రషింగ్‌ను పునరుద్ధరించకపోవడంతో రైతుల్లో సహనం నశించింది. తొమ్మిది గంటల సమయంలో ఫ్యాక్టరీ ఎదుట అనకాపల్లి- చోడవరం ప్రధాన రహదారిపైకి వచ్చి ఆందోళనకు దిగారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక సీఐ అప్పలరాజు, ఎస్‌ఐలు గోవాడ చేరుకుని రైతులకు నచ్చ చెప్పేందుకు ప్రయత్నించారు. క్రషింగ్ అవాంతరాలపై ఫ్యాక్టరీ ఎండీ, ఇతర అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని, అంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడం, మరోవైపు పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడుతుండడంతో పోలీసులు ఫ్యాక్టరీలోకి వెళ్లి ఎండీ సన్యాసినాయుడుని వెంటబెట్టుకుని వచ్చారు. సాంకేతిక కారణాల వల్ల క్రషింగ్ ఆగిందని, పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నామని ఎంపీ వివరణ ఇచ్చారు. ఆయన సమాధానంతో సంతృప్తి చెందని రైతులు ఆగ్రహంతో ఎండీతోపాటు ఇతర అధికారులపైకి దూసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అధికారులు ఫ్యాక్టరీలోకి పరుగులు తీశారు. వారిని వెంబడిస్తున్న రైతులను పోలీసులు నిలువరించి, చెరకు క్రషింగ్‌ను త్వరగా పునరుద్ధరించేలా చూస్తామని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రైతుల ఆందోళన కారణంగా సుమారు మూడున్నర గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది.

20 గంటల తరువాత క్రషింగ్ పునరుద్ధరణ

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో తలెత్తిన సాంకేతిక అవాంతరాలను సరిదిద్దిన అధికారులు గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు క్రషింగ్‌ను పునరుద్ధరించారు. వాస్తవంగా టర్బయిన్‌లో సమస్యల కారణంగా మంగళవారం క్రషింగ్ ఆగిపోయింది. సమస్యను సరిదిద్ది బుధవారం ఉదయం తిరిగి ప్రారంభించారు. బగాస్ కొరత కారణంగా సాయంత్రం క్రషింగ్ నిలిచిపోయింది.

అనకాపల్లి ఆర్డీవో విచారణ

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిచిపోవడం, చెరకు రైతులు ఆందోళన చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అనకాపల్లి ఆర్డీవో ఆయిషా గురువారం మధ్యాహ్నం షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. పరిస్థితిని పరిశీలించి క్రషింగ్ అంతరాయాలు, ఇతర సమస్యలపై ఎండీతో చర్చించారు. అనంతరం యార్డులో ఉన్న చెరకు రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రషింగ్ తరచూ ఆగిపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు రైతులు ఆర్డీవోకు చెప్పారు. ఆమె తహసీల్దార్ అంబటి రామారావు, రెవెన్యూ సిబ్బంది వున్నారు.



చెరకు రైతులతో మాట్లాడుతున్న అనకాపల్లి ఆర్డీవో ఆయిషా

జిల్లాలో 96.22 శాతం పోలింగ్



కంట్రోల్ రూమ్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

... 5వ పేజీ తరువాయి

సత్యనారాయణరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనంలో విశాఖలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలించారు.

కలెక్టరేట్ నుంచి పోలింగ్ సరళి పరిశీలన

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. పోలింగ్‌తోపాటు గంట గంటకు నమోదైన పోలింగ్ శాతాన్ని వెబ్‌కాస్టింగ్ ద్వారా తెలుసుకున్నారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు డీఆర్‌వో సత్యనారాయణరావు కంట్రోల్ రూమ్‌లోనే వుండి పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం: ఎస్పీ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ తుహిన్‌సిన్హా చెప్పారు. అనకాపల్లిలోని జీవీఎంసీ ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగిందని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేసినట్టు ఆయన చెప్పారు.



నక్కపల్లిలో పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ జరుగుతున్న దృశ్యం



రాంబిల్లిలో బ్యాలెట్ బ్యాక్స్‌ను తరలిస్తున్న పోలింగ్ సిబ్బంది

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

పాయకరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలోని సచివాలయం-5 భవనంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 170 మంది ఓటర్లకు 162 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ 95 శాతం ఓటింగ్ జరిగింది. ఓటర్ల లిస్టులో 149 నంబరు ఎం.(మట్టా)గణేష్(పీడీ) పేరు ఉండగా ఆ పేరుతో ఉన్న మరొక వ్యక్తి(ఈయన పేరు కూడా ఎం.(మట్లా)గణేష్, అదేవిధంగా ఆయన కూడా పీడీనే) ఉదయం 10 గంటల సమయంలో ఓటరు ఐడీ చూపి ఓటు వేసి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తరువాత అసలు ఓటరు రావడంతో విషయం బయటపడింది. దీంతో పోలింగ్ ఆఫీసర్ టెండరు ఓటు వేయాల్సి వచ్చింది. పాయకరావుపేటలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఏపీటీఎఫ్ నాయకులు ఏర్పాటుచేసిన టెంట్ వద్ద ఉన్న కూటమి నాయకులతో కొద్దిసేపు మాట్లాడి వెళ్లిపోయారు.



పాయకరావుపేటలో ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న హోంమంత్రి అనిత



అచ్యుతాపురంలో ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న సుందరపు, ప్రగడ

మునగపాకలో..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 44 మంది ఓటర్లకు 41 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు అధికారిగా ఎం.రామారావు వ్యవహరించారు. పోలింగ్ కేంద్రాన్ని పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ సందర్శించారు. రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఎన్నిక పరిశీలకుడు అనుసూరి మధు ఓటింగ్ శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మద్దతుగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రానికి దూరంలో శిబిరం ఏర్పాటు చేశారు.

రాంబిల్లిలో..

స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యా ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు 26 మంది ఓటర్లలో 25 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ నర్సింగరావు నేతృత్వంలో పోలీస్ సిబ్బందిని బందోబస్తు నిర్వహించారు. 96శాతం ఓటింగ్ పోలయ్యిందని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. రఘువర్మకు మద్దతుగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, పరిశీలకులు మధుసూదన్ సందర్శించారు.

అచ్యుతాపురంలో..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 73 మంది ఓటర్లుండగా 71 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలో 97.26 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ జనార్దన్ తెలిపారు. ఎన్నిక సరళిని పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరచిన అభ్యర్థులు విజయం ఖాయమన్నారు.

నక్కపల్లిలో..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నక్కపల్లి గర్ల్స్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం నిర్వహించిన పోలింగ్‌లో మొత్తం 52 మంది ఓటర్లకు గానూ 51మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. హోం మంత్రి అనిత, పలు పార్టీల నాయకులు ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. తహసీల్దార్ నర్సింహమూర్తి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి పట్టణంలో గురువారం జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 180 మంది ఓటర్లకు గాను 167 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ 93.30 శాతం నమోదైనట్టు ఎన్నికల అధికారి తెలిపారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, ఓటింగ్ సరళిని పరిశీలించారు. రఘువర్మ మద్దదారుల శిబిరాన్ని రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వేర్వేరుగా సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. శిబిరం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సహకారం అందించారు.

కోటవురట్లలో..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. మొత్తం 81 మంది ఓటర్లు ఉండగా.. 78 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 96శాతం ఓట్లు పోలింగ్ అయ్యాయని తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు కోటవురట్లలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎస్ఐ రమేశ్ బందోబస్తు నిర్వహించారు.

ఎస్.రాయవరంలో..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ధర్మవరం అగ్రహారంలో ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో 81 మంది ఓటర్లు ఉండగా శతశాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కేంద్రాన్ని తహసీల్దార్ రమేశ్‌బాబు పరిశీలించారు. రఘువర్మకు మద్దతుగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సందర్శించారు.

నేత్రపర్వంగా నూకతాత సంబరం



నూకతాత ఆశీస్సుల కోసం రోడ్డుపై వేచివున్న భక్తులు



నూకతాత ఘటాన్ని మోస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేటలో మత్స్యకారుల ఆరాధ్య దేవత నూకతాత జాతర గురువారం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా మహాశివరాత్రి నుంచి అమావాస్య వరకూ రాజయ్యపేటలో నూకతాత సంబరాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ముందుగా నూకతాత ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు దేవతామూర్తులను రాజయ్యపేట తీరానికి తీసుకెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు.

రాజయ్యపేటలో రెండు కిలోమీటర్ల మేర వందలాది మంది భక్తులు రోడ్డుపై శయనించి నూకతాత ఆశీస్సుల గంటల తరబడి కోసం వేచివున్నారు. పూజారులు నడిరోడ్డుపై శయనించిన వారిపై నుంచి నడుచుకుంటూ వెళ్లి ఆశీస్సులు అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నూకతాత జాతరలో పాల్గొన్న హోంమంత్రి అనిత

రాజయ్యపేట నూకతాత జాతరలో గురువారం హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఆ గ్రామ పెద్దలు, కూటమి నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. నూకతాత ఘటాన్ని హోం మంత్రి అనిత మోసి, మొక్కు చెల్లించుకున్నారు. ఆమె వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

తీరంలో భక్తుల పుణ్య స్నానాలు



జాగరణలో భాగంగా శివపూజలు చేసిన మునగపాక మహిళలు



పాయకరావుపేట రూరల్: పెంటకోట తీరంలో సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

మునగపాక, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన శివాలయాల్లో అర్ధరాత్రి వరకు లింగోద్భవ పూజలు జరిగాయి. శివాలయాల్లో బుధవారం వేకువ జామున మొదలైన మహాశివరాత్రి పూజలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. రుద్రాభిషేకం, జలాభిషేకం, లింగోద్భవ పూజలతోపాటు పలు దేవాలయాల్లో కల్యాణ వేడుకలు నిర్వహించారు.

రాంబిల్లిలో..

మహాశివరాత్రి పురస్కరించుకొని జాగరణ చేసిన భక్తులు గురువారం పంచదార్లలోని రాధామాధవస్వామి ఆలయంలో ఆకాశధార వద్ద, వాడరాంబిల్లి, కొత్తపట్నం, వాడనర్సాపురం, లోవపాలెం గ్రామాల సముద్ర తీరాల్లోను పుణ్య స్నానాలు ఆచరించారు. పంచదార్లలో రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాగరణ చేసిన భక్తులు ఆకాశగంగ వద్ద పుణ్యస్నానాలు ఆచరించి, ధర్మలింగేశ్వరునికి పూజలు చేశారు. వాడపాలెం, కొత్తపట్నం, లోవపాలెం వెంకయ్యపాలెం, లాలంకోడూరు, దిమిలి తదితర ఆలయాల్లో జాగరణ చేసిన భక్తులు సముద్రతీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించారు.



రాంబిల్లి: పంచదార్లలో ఆకాశధార వద్ద జాగరణ స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని పెంటకోట, వెంకటనగరం, రాజవరం, రాజానగరం, రత్నయ్యమ్మపేట, పాల్మన్‌పేట, కొర్లయ్యపేట సముద్ర తీరాల్లో గురువారం భక్తులు జాగరణ స్నానాలు ఆచరించారు. పెంటకోట సముద్ర తీరంలో డీఎల్.పురం గ్రామానికి చెందిన గింజాల రాజు సముద్రంలో మునిగిపోతుండగా హోం గార్డు పిక్కి రాజు రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు.

నక్కపల్లిలో..

మండలంలోని బోయపాడు, రాజయ్యపేట తీరంలో గురువారం జాగారం చేసిన భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ రెండు తీరాలు సందడిగా కన్పించాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా శివ పార్వతుల కల్యాణం



సత్యవరంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సత్యవరం, పెంటకోట, పెద్దిపాలెం, గోపాలపట్నం సీతమ్మవారికొండ, రాజగోపాలపురం, నామవరం గ్రామాల్లోని శివాలయాలలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సత్యవరంలోని ఉమా రామ లింగేశ్వరస్వామి ఆలయం, గోపాలపట్నం సీతమ్మవారి కొండపై ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయం, పెద్దిపాలెం కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాలలో వేదపండితులు శివపార్వతుల కల్యాణాన్ని కమనీయంగా చేశారు. భారీ సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని కనులారా వీక్షించారు. సత్యవరంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్న పిల్లలు చేసిన భరత నాట్యం, నృత్య రూపకాలు అలరించాయి. అనంతరం భక్తులు లింగోద్భవ కాలంలో అభిషేకాలు నిర్వహించారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్టు

ఎలమంచిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామ శివారున పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.27వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఘనంగా వినాయక మందిరం వార్షికోత్సవం

మునగపాక, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అరబుపాలెంలో వినాయక మందిరం 32వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బాలవీరుల సేవా సంఘం ఆధ్వర్యంలో పూజలు, అన్నసమారాధన నిర్వహించారు. వినాయకుని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కోలాట కళాకారులకు మైక్‌సెట్ వితరణ

మునగపాక, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని శ్రీలక్ష్మి గణపతి కోలాట బృందానికి మైక్‌ను ఏపీ గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో వెలగా శ్రీనివాసరావు, ఆడారి కాశిబాబు, ఆడారి బాపునాయుడు, కోలాట కళాకారులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి అభినందనలు



వెంకట జగన్నాథ్‌ని అభినందిస్తున్న సీఐ జి.అప్పన్న

పాయకరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఏపీ సీనియర్(మాస్టర్స్) బాడ్మింటన్ ఛాంపియన్ షిప్-2025 రాష్ట్రస్థాయి పోటీల్లో 45+ విభాగంలో పట్టణానికి చెందిన పడాల శ్రీవెంకట జగన్నాథ్ సత్తాచాటి బంగారు పతకాన్ని సాధించాడు. గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వెంకట జగన్నాథ్‌ని పాయకరావుపేట సీఐ జి.అప్పన్న అభినందించారు. అదేవిధంగా 45+ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రన్నర్స్‌గా వెండి పతకం సాధించి, గోవాలో జరిగే అఖిల భారత సీనియర్(మాస్టర్స్) బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలకు అర్హత సాధించాడని తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

'పేట'లో చికెన్ అండ్ ఎగ్ మేళా



చికెన్ కర్రి, ఎగ్స్ కోసం బారులు తీరిన పట్టణవాసులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : చికెన్ కర్రీ తినడం వలన ఆరోగ్యానికి ఎటువంటి హాని లేదని తెలియజేసేందుకు నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ ఆధ్వర్యంలో వెంకాబ్ చికెన్ సంస్థ గురువారం సాయంత్రం పట్టణంలో చికెన్ అండ్ ఎగ్ మేళా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 కేజీల చికెన్ కర్రీ, ఉడికించిన రెండు వేల కోడిగుడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు వందలాదిగా తరలివచ్చి చికెన్ కర్రీ, ఎగ్స్ కోసం ఎగబడ్డారు.

42 మందికి ఉచిత కంటి పరీక్షలు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపోలవరంలో గురువారం పాయకరావుపేట హైమ నేత్రాలయం వైద్యులు నిర్వహించిన వైద్య శిబిరంలో 42 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు పాల్గొన్నారు.

ఆడ శిశువు పిండం లభ్యం

నక్కపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన దొడ్డిగల్లు గ్రామంలోని ఒక వీధిలో గురువారం సాయంత్రం ఆడ శిశువు పిండాన్ని నక్కపల్లి పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించి సీఐ కుమారస్వామి విలేకర్లతో మాట్లాడుతూ స్థానికుల సమాచారం మేరకు ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న చెత్త కుప్ప వద్ద ఆడ శిశువు పిండాన్ని పరిశీలించామన్నారు. దీనిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు అంతర్జాతీయ టైలర్స్ డే

ఎలమంచిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో ది టైలర్స్ ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణ తెలిపారు. సమావేశంలో టైలర్ల సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలపై చర్చించుకోవడం జరుగుతుందన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ టౌన్ ఫీడర్ లైను నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని మిలట్రీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, ప్రధాన రోడ్డు, ద్వారకానగర్, నెహ్రూనగర్, ఎర్రవరం, కొత్త ఎర్రవరం, లైను కొత్తూరు, సోమన్నపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

▸ ఓటు వేసేందుకు క్యూలో నిలిచిన ఉపాధ్యాయులు ▸ స్లిప్పులు పంచిపెట్టిన బరిలో ఉన్న అభ్యర్థుల మద్దతుదారులు


నర్సీపట్నంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎన్నికల పరిశీలకుడు


మాకవరపాలెం పోలింగ్ కేంద్రం సమీపం శిబిరంలో కూటమి నాయకులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ఇక్కడ ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడున్నర గంటల నుంచే ఓటు వేసేందుకు ఉపాధ్యాయులు ఆయా కేంద్రాల వద్ద క్యూలో వేచి ఉన్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీతో పాటు మండలంలో 417మంది ఓట్లకు 397 మంది స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల అబ్జర్వర్ ఎంఎం నాయక్, ఆర్డీవో వీవీ రమణ, డీఎస్పీ శ్రీనివాసరావు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఇదిలావుంటే, ప్రధానంగా పోటీలో ఉన్నముగ్గురు అభ్యర్థుల తరపున శిబిరాలు పెట్టి, ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే దారిలో పాత మునిసిపల్ కార్యాలయం ఎదురుగా పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఏపీటీఎఫ్, టీడీపీ నాయకులు, పశువుల ఆస్పత్రికి పక్కన గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతుగా పీఆర్‌టీయూ, పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా యూటీఎఫ్ శిబిరాలు ఏర్పాటు చేశారు.


గొలుగొండ కేంద్రంలో ఓటింగ్ దృశ్యం


నాతవరంలో...

గొలుగొండలో...

గొలుగొండ : మండల కేంద్రం గొలుగొండ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం ఎనిమిది గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. మొత్తం మండల వ్యాప్తంగా 80 ఓట్లు ఉండగా, 78 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు పోలింగ్ తీరును పరిశీలించారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఇక్కడ ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 53 ఓట్లు ఉండగా, ఓటర్లు అంతా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఇక్కడ శతశాతం పోలింగ్ జరిగినట్లైంది. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టారు.

నాతవరంలో..

నాతవరం : మండల కేంద్రం నాతవరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్ని కల్లో 98శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం71 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 69 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గంజాయి కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా

గొలుగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ విశాఖ లోని ఎంఎస్‌జే కోర్టు కన్‌ఫర్మ్‌డ్ అడిషినల్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ తీర్పు చెప్పినట్టు నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన గురువారం ఇక్కడ మీడి యాకు వెల్లడించిన వివరాలిలా వున్నాయి. గొలు గొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ శివారు పోలవరం గ్రామానికి చెందిన గజ్జి సత్తిబాబు 2014 నవంబరు 22వ తేదీన 183 కిలోల గంజాయిని


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఏజెన్సీ నుంచి ట్రాక్టర్‌పై తీసుకువస్తుండగా పోలవరం గ్రామానికి సమీపంలోని వంతెన వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి ఎస్‌ఐ జోగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టులో విచారణ జరగ్గా.. సత్తిబాబుపై పోలీసులు మోపిన అభియోగం రుజువు కావడంతో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలపాటు జైలు శిక్ష అనుభవించాల్సి వుంటుందని పేర్కొన్నారు. విలేక రుల సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, గొలుగొండ ఎస్‌ఐ రామారావు పాల్గొన్నారు.


గొలుగొండ మండలం ధారమఠంలో స్వామికి భక్తుల పూజలు


కొంగసింగి శివాలయంలో...

పుణ్యస్నానాలు.. పరమశివుని దర్శనాలు

▸ అత్యంత భక్తిశ్రద్ధలతో శివరాత్రి జాగారం ▸ వేకువనే ఆలయాల్లో విశేష పూజలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : హరహర మహాదేవ.. శంభో శంకర నినాదాలతో శివాలయాలు మార్మోగాయి. మహా శివరాత్రి సందర్భంగా జాగరణ చేసిన భక్తజనం గురువారం ఉదయం ఆలయాలకు తరలి రావడంతో కిక్కిరిసిపోయాయి. ఇందులో భాగంగా నర్సీపట్నంలోని బలిఘట్టం ఉత్తర వాహిని వద్ద కోలాహల వాతావరణం నెలకొంది. గురువారం వేకువజామున వాహినిలో పుణ్య స్నానాలు చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్నానాల అనంతరం అర్చకులు, బుడగ జంగాలతో పితృ దేవతలను స్మరించుకున్నారు. ఆ తరువాత త్రిశూల పర్వత శ్రేణిపై కొలువుదీరిన బ్రహ్మలింగేశ్వర స్వామి దర్శించుకున్నారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద ఇరవై కళా బృందాలతో కోలాటం, చిడతలు, చెక్క భజనలు, హరి భజనలు ఏర్పాటు చేశారు. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం, ఉత్తరవాహిని ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా డీఎస్పీ పి.శ్రీనివాసరావు డ్రోన్ ఉపయోగించి సిబ్బంది అప్రమత్తం చేశారు. మునిసిపల్ కమిషనర్ జె.సురేంద్ర పరిసరాలలో ప్లాస్టిక్, తినుబండారాలు వ్యర్థాలను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులతో తొలగించారు. పార్కింగ్, స్నాన ఘట్టాల వద్ద ఎన్‌సీసీ విద్యార్థులు విశేష సేవలందించారు.


నర్సీపట్నంలోని బలిఘట్టం ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలకు తరలి వచ్చిన భక్తులు

అన్నప్రసాదం పంపిణీ

బలిఘట్టం ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు చేయడానికి విచ్చేసిన భక్తుల కోసం అన్నపూర్ణ అక్షయపాత్ర సంస్థ ఆధ్వర్యంలో 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి గురువారం ఉదయం అల్పాహారం, మధ్యా హ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. సత్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ప్రత్యేకంగా టెంట్ ఏర్పాటు చేసి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు


భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న చింతకాలయ పద్మావతి, దివ్యశ్రీ

భక్తులకు వీటిని వడ్డించారు. పద్మావతితో పాటు ఆమె కోడలు, 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ భర్య దివ్యశ్రీ కూడా ఈ సేవల్లో పాల్గొన్నారు.

ధారమఠం భక్తులతో కిటకిట

గొలుగొండ : శివరాత్రి జాగరణ చేసిన భక్తులు మండలంలోని ధారమ ఠం ఉమాధార మల్లేశ్వస్వామి అలయానికి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో జాతరను తలపించింది. గొలుగొండ, జోగంపేట, పాతమల్లంపేట, సాలికమల్లవరం, పాకలపాడు, అమ్మపేట, కొత్తమల్లంపేట, గుండుపాల తదితర గ్రామాల నుంచి వచ్చి ఇక్కడి జలపాతంలో స్నానాలు చేశారు. అనంతరం పరమశివుడ్ని దర్శించుకున్నారు. జోగంపేట గ్రామానికి చెందిన పైల ప్రసాద్ సుమారు నాలుగువేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అలాగే, చీడిగుమ్మలలో గల కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్‌ఐ రామారావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం నీలకంఠేశ్వరస్వామి, కొంగశింగి శివాలయాల్లో గురువారం ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత నీలకంఠేశ్వర ఆలయ సమీపంలోని ఉత్తరవాహిని బొడ్డేరు గెడ్డలో స్నానాలు ఆచరించిన అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఈ ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఈ వేడుకల్లో గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, మాజీ సర్పంచ్ చెల్లూరి సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల్యాణపులోవకు రెండో రోజూ పోటెత్తిన భక్తులు

▸ శివనామ స్మరణతో హోరెత్తిన లోవ


భక్తులతో కిటకిటలాడుతున్న కల్యాణపులోవ

రావికమతం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కల్యాణపు లోవ జాతర రెండో రోజూ గురువారం భక్తులు పోటెత్తారు. జాతర శివనామ స్మరణతో హోరెత్తింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో స్నానాల రేవు, ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయం వద్ద రద్దీ పెరగడంతో భక్తులు గంటల తరబడి క్యూలో నిల్చో లేక ఇబ్బంది పడ్డారు. రెండో రోజు లక్షన్నరకు పైగా భక్తులు వచ్చినట్టు ఎండోమెంట్ అధికారులు తెలిపారు. లోవకు వచ్చిన మేడివాడకు చెందిన యిమంది శేషు పిట్స్‌తో పడిపోవడంతో అధికారులు, పోలీసులు 108లో నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. రెండో రోజూ డీసీసీబీ ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాల వద్ద భక్తులు సేదతీరారు. రావికమతం డీసీసీబీ బ్రాంచ్ సీఈఓ దుర్గాప్రసాద్, మలిశెట్ల కిషోర్ ఆధ్వర్యంలో సిబ్బంది లక్ష మందికిపైగా మజ్జిగను పంపిణీ చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఎండోమెంట్, ఉత్సవ కమిటీ, వివిధ శాఖల అధికారులు చేశారు. అనకాపల్లి డీస్పీ శ్రావణి జాతరలో ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ కోటేశ్వరరావు బందోబస్తు ఏర్పాట్లను వివరించారు.

14న ఉత్తరాంధ్ర పాడిపశువుల పాల పోటీలు

చీడికాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పాల పోటీలను మార్చి 14వ తేదీన నిర్వహించనున్నట్టు పశుసంవర్థక శాఖ పాడేరు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ సీహెచ్.నర్సింహులు తెలిపారు. మండలంలో వింటిపాలెం, జి.కొత్తపల్లి, ఎ.అగ్రహారంల్లో ఏడీ చిట్టినాయుడు, వైద్యాధికారులతో కలిసి పాడిపశువులను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, విజయనగరం జిల్లా తోటపాలెంలో నిర్వహించే పశువుల పాల పోటీలకు పాడిరైతులు 14వ తేదీ మధ్యాహ్నం 3గంటల్లోపు హాజరవ్వాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30వేలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ ఎ.గణేష్, డాక్టర్ గాయత్రిదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కోనాం సంతలో చింతపండుకు గిరాకీ

చీడికాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాంలో గురువారం జరిగిన సంతకు గిరిజనులు తీసుకువచ్చిన చింతపండుకు గిరాకీ ఏర్పడింది. ఉదయం 10 గంటలకే వ్యాపారులు చింతపండును కొనుగోలు చేశారు. గతవారం రూ.35 నుంచి రూ.45లకు కొనుగోలు చేయగా.. ఈ వారం రూ.50 నుంచి రూ.55 లకు కొనుగోలు చేశారు. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తూ నిత్యావసరాలు కొనుగోలు చేసి స్వగ్రామాలకు వెళ్లిపోయారు.


గిరిజనులు తెచ్చిన చింతపండు

టమోటాకు గిట్టుబాటు ధర కరువు

కోనాం సంతకి తీసుకువచ్చిన టమోటాకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు నిరాశ చెందారు. మండలంలో గుంటుకొత్తూరు, శిరిజాం, ఎస్ఎన్.పురం, రామ్‌నగర్ కాలనీ, ఎల్ఎన్.పురం రైతులు పండించిన టమోటా 30కిలోల క్రేట్ రూ.120లు నుంచి రూ.150లు వరకూ వ్యాపారులు కొనుగోలు చేశారు. కిలోకి ఐదు రూపాయలు రాకపోవడంతో రైతులు నిరాశ చెందారు.

కబడ్డీ పోటీల విజేత అనకాపల్లి జట్టు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వడ్డాది కొత్తూరు స్వయంభూ పద్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్ధ స్థానాలలో అనకాపల్లి, వైజాగ్ వారియర్స్ శ్రీకాకుళం, వడ్డాది జట్లు గెలుపొందాయి. విజేతలకు ఎడిషనల్ ఎస్‌ఐ ఎస్.భాస్కరరావు, గ్రామపెద్దలు నగదు పురస్కారాలు అందించారు.

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు


చోడవరంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న టీచర్లు


రోలుగుంటలో ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక కొత్తూరు బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 306 ఓట్లకు గాను 296 ఓట్లు పోలయ్యాయి. అనకాపల్లి సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా సాధారణ ఎన్నికల స్థాయిలోనే ఉపాధ్యాయ సంఘాలు ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, యూటీఎఫ్‌లు కొత్తూరు జంక్షన్‌లో శిబిరాలు ఏర్పాటు చేసి దగ్గరుండి ఉపాధ్యాయులతో ఓట్లేయించారు. కాగా టీడీపీ, జనసేన మద్దతు ఇచ్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ తదితరులు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల శిబిరాన్ని సందర్శించారు.

కె.కోటపాడులో..

మండల కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 107 ఓటర్లు ఉండగా 102 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 69 పురుషులు, 33 మంది మహిళా ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి తెలిపారు.

రోలుగుంటలో..

రోలుగుంటలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 48 ఓట్లు ఉండగా 48 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ముగిసే సమయానికి శత శాతం పోలింగ్ అయినట్టు ఎన్నికల అధికారి సోమశేఖర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి తనిఖీ చేశారు. అలాగే ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్. రాజు కూడా పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

దేవరాపల్లిలో..

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ బూత్‌లో 63 మంది ఓటర్లు ఉండగా 62 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు, అదనపు ఎస్.ఐ రాములమ్మ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన రఘువర్మ శిబిరాన్ని రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్, ఎన్నికల పరిశీలకులు మామిడి దుర్గారావు ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

మాడుగులలో..

మాడుగుల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో 96.35 శాతం ఓటింగ్ జరిగింది. ఇక్కడ 55 మంది ఓటర్లు ఉండగా 53 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్టు ఎన్నికల అధికారిణి కె.రమాదేవి తెలిపారు. ఎస్‌ఐ నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

చీడికాడలో..

చీడికాడ హైస్కూల్‌లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ బూత్‌లో 46 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి చిరంజీవిరావు తెలిపారు. ఇక్కడ శతశాతం ఓటింగ్ జరిగిందని ఆయన చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ బి.సతీష్ బందోబస్తు ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ఈవీఎస్. సత్యనారాయణ పరిశీలించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ గెలుపు ఖాయమని జోస్యం చెప్పారు.

బుచ్చెయ్యపేటలో..

స్థానిక ఎంపీయూపీ స్కూల్‌లో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ బూత్‌లో 34మంది ఓటర్లకు గాను 33 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద 144సెక్షన్ విధించారు.

రావికమతంలో..

రావికమతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 52 మంది ఓటర్లు ఉండగా 51మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కావాలనే క్రషింగ్‌కు అవాంతరాలు

▸ రైతు సంఘాల నాయకులు ధ్వజం

చోడవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్‌కు కావాలనే అవాంతరాలు సృష్టిస్తున్నారని ఏపీ రైతు సంఘం, రైతు కూలీ సంఘం, సీపీఎం నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు లోకనాథం, రైతు కూలీ సంఘం నాయకులు కోన మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, గోవాడ దుస్థితికి ముమ్మాటికీ కారణం ఎంపీ, స్థానిక ఎమ్మెల్యేలు బాధ్యత వహించాలన్నారు. ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకుని వస్తామని హామీలు ఇచ్చిన నాయకులు, ప్రస్తుతం క్రషింగ్ సీజన్‌ను కూడా సజావుగా నడపలేక రైతులను ఇబ్బందులకు గురిచేయడాన్ని వారు తప్పుపట్టారు. ఇథనాల్, డిస్టిలరీ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తామని రైతులను మభ్యపెడుతూ, గోవాడ ఫ్యాక్టరీని మూసివేయించే కుట్రకు కూటమినేతలు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి చెరకు రైతుల నోట్లో మట్టికొట్టేందుకు కూటమి నేతలు పావులు కదుపుతున్నారని విమర్శించారు. అధికారంలోనికి వచ్చిన తరువాత గోవాడకు ఎన్ని నిధులు తీసుకుని వచ్చారో, ఫ్యాక్టరీ నిర్వహణకు ఏం చర్యలు తీసుకున్నారో నేతలు రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో అసహనం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకలపూడిలో గురువారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో విజయలక్ష్మి ఆకస్మికంగా సందర్శించారు. కూలీలతో మాట్లాడి పనుల వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్నం 12గంటల వరకూ ఎండవేడిలో కూలీలతో పనిచేయిస్తుండడంతో ఎంపీడీవో అసహనం వ్యక్తంచేశారు.

ఘనంగా పోతురాజుబాబు ఉత్సవాలు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండ లంలో పెదపూడి శివారు పంగిడి గ్రామంలో గురువారం పోతురాజు బాబు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు పోతురాజుబాబుని దర్శించుకుని పూజలు జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు జరిపారు. కూటమి నేతలు విశాఖడెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు, దొండా నరేష్, ఎంవీవీ.సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీలు

రోలుగుంట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పోతురాజుబాబు పండుగ మహోత్సవం సందర్భంగా గురువారం కొండపాలెంలో జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీలను టీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి ప్రారంభించారు. ఈ పోటీల్లో పరవాడ నాయుడు(అర్జునగిరి), సిరికి దుర్గాప్రసాద్(కేఎల్‌బీపట్నం), ముమ్మిన రామకృష్ణ(నర్సయ్యపేట), శ్రీఆంజనేయ(కేజేపురం), అభయ ఆంజనేయ(సింహాద్రిపురం) విజేతలుగా నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీపీ అగ్రహారంలో అగ్ని ప్రమాద బాధితుడు సానబోయిన అప్పారావు కుటుంబానికి విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ రూ.10వేలు నగదు, 50కిలోల బియ్యం అందజేశారు.

ఘనంగా సీతారాముల తీర్థం

కె.కోటపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుల్లేపల్లిలో గురువారం సీతారాముల తీర్థం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామస్థులు సీతారాములను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సీతారాములును దర్శించుకున్నారు. మధ్యాహ్నం గుర్రపు పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, సర్పంచ్ బండారు దేముళ్లు, ఎంపీటీసీ సభ్యుడు కశిరెడ్డి దేవుడుబాబు, బండారు ప్రసాద్, తంగేటి శ్రీను, కె. గంగరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త అప్పారావు మృతి

మాడుగుల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదమాంబ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త గంగ్రేటి అప్పారావు గురువారం మృతి చెందారు. మృతదేహంపై టీడీపీ జెండాను మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరగంట ముందు వరకు అందరితో కలసిమెలసి సరదాగా ఉన్న అప్పారావు కొద్దిసేపటికే మృతి చెందడం జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. అప్పారావు కుటుంబ సభ్యులను టీడీపీ నాయకులతోపాటు వైసీపీ నాయకులు, అధిక సంఖ్యలో వచ్చి పరామర్శించారు.

నేడు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూములకు కౌలు వేలం

చోడవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవరవరం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములకు శుక్రవారం కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో ఎస్‌వీవీ. సత్యనారాయణ తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన రైతులు రూ.5వేలు ధరావత్తుగా చెల్లించాలన్నారు.

ఘనంగా శివరాత్రి వేడుకలు

చోడవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా రావికమతం మండలం కొత్తకోటలో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదియోగి విగ్రహంతోపాటు మంచు శివలింగాల వద్ద గురువారం రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రాభిషేకంలో వంద మంది దంపతులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో రాజన్న ఫౌండేషన్ చైర్మన్, జనసేన ఇన్‌చార్జి పీవీ ఎస్ఎన్ రాజు, జనసేన నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన రవికుమార్

అనంతగిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రా-ములియగుడ రోడ్డులోని జీరుగెడ్డ సమీపంలోని బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. బొర్రాలో జరిగిన జాతరకు గుమ్మకోట పంచాయతీ శంకుపర్తి గ్రామానికి చెందిన జన్ని రవికుమార్ స్నేహితులతో కలిసి బైక్‌పై వచ్చారు. అయితే జాతర తిలకించిన అనంతరం అర్ధరాత్రి తిరిగివస్తుండగా, జీరుగెడ్డ సమీపంలోని బైక్ అదుపుతప్పి గోతిలోకి దూసుకుపోయింది. దీంతో రవికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సాయంతో 108 వాహనంలో ఎస్.కోట మీదుగా విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతనిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం యువకుడు పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు తెలిసింది.

ఆటో బోల్తా...

అనంతగిరి: కాశీపట్నం వద్ద ఆటో బోల్తాపడింది. బొర్రా జాతర చూసిన అనంతరం గురువారం ఉదయం స్టీల్ సామగ్రితో ఎస్. కోటవైపుగా వెళ్తున్న ఆటో కాశీపట్నం సమీపంలో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఆటోలో ఉన్న డ్రైవర్ కు గాయాలుకాలేదు

లోతుగెడ్డ వైద్యాధికారి సేవలు భేష్: డీఎంహెచ్‌వో


వైద్యాధికారిని సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లోతుగెడ్డ పీహెచ్‌సీ వైద్యాధికారి జి. లక్ష్మీకాంత్ సేవలు అభినందనీయమని డీఎంహెచ్‌వో జమాల్ బాషా అన్నారు. గురువారం పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యాభ్యాసానికి వెళుతున్న వైద్యాధికారిని వైద్యాధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నాలుగేళ్లపాటు పనిచేసిన లక్ష్మీకాంత్ రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించారన్నారు. ఆయన ఎనస్థీషియా పీజీకి ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ధారకొండ, కోరుకొండ, డౌనూరు వైద్యాధికారి డీకే హిమబిందు, శివప్రసాద్, వర ప్రసాద్, సబ్ యూనిట్ అధికారి బుక్కా చిట్టిబాబు పాల్గొన్నారు.

'ఏకలవ్య' ఉపాధ్యాయులపై విచారణ


విద్యార్థినులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిని

చింతపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను అమానుషంగా దండించడంపై పాడే రు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజిని గురువారం విచారణ చేపట్టారు. పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు బాలికలను టీజింగ్ చేస్తున్నారన్న ఆరోపిస్తూ వీరిని ఉపాధ్యాయులు పది రోజుల క్రితం విచక్షణ రహితంగా కొట్టిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాలపై పాఠశాలను డీడీ సందర్శించారు. ఈ సమయంలో విద్యార్థులను అమానుషంగా శిక్షించిన ఇద్దరు ఉపాధ్యాయులు, అకౌంటెంట్ సెలవుపై ఉన్నారు. ప్రిన్సిపాల్ పాఠశాల పనులపై బయటకు వెళ్లారు. దీంతో డిప్యూటీ డైరెక్టర్ ఎనిమిదో తరగతి బాలికలు, ఉపాధ్యాయులు శిక్షించిన బాలలతో వేర్వేరుగా విచారించారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి ఆహారం తీసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్, ఐటీడీఏ పీవోతోపాటూ గురుకులం అధికారులకు పంపిస్తామని డీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగేందుకు ఎంఎస్‌ఎంఈలు దోహదం


వ్యాపారుల వివరాల నమోదులో ఎంపీడీవో

అనంతగిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చి న్న మధ్య తరహా పరిశ్రమల) ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు అ వ కాశం ఉంటుందని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ అన్నారు. కలెక్టర్ ఆదేశా లపై మండల కేంద్రంలో సచివాలయ సిబ్బందితో కలిసి గురువారం స్థానిక వ్యాపారులకు వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రస్తుతం చేస్తున్న ద్వారా వ్యాపారాలకు ప్రభుత్వం పరంగా ప్రోత్సాహం ఉందా? బ్యాంకు రుణాల ఏమైనా అందాయా లేదా అనితెలుసుకుని ఎంఎస్ఎంఈ యాప్‌లో నమోదు చేశారు. కార్యదర్శి దేవా, సచివాలయ సిబ్బంది సంధ్య, వసంత, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీఎంహెచ్‌వోకి సన్మానం

చింతపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద పదవి విరమణ పొందిన పశ్చిమగోదావరి డీఎంహెచ్‌వో డి. మహేశ్వరరావు సేవలు మరువలేనివని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక అన్నారు. గురువారం ఏరియా ఆస్పత్రికి వచ్చిన మహేశ్వరరావు దంపతులను వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. లంబసింగి పంచాయతీ లబ్బంగికి చెందిన మహేశ్వరరావు గిరిజన ప్రాంతంలో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలందించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారులు చంద్రశేఖర్, భారతి, రుక్మిణి, రమేశ్, లావణ్య, ఏరియా ఆస్పత్రి వైద్యసిబ్బంది రాజారావు, అనిల్‌బాబు, గౌరీశంకర్, సోమేశ్‌కుమార్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్


జి. మాడుగులలో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ గౌడ


పాడేరులో పోలింగ్ కేంద్రం ఎదుట శిబిరంలో టీడీపీ నేత ఈశ్వరి, నేతలు

పాడేరురూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపా ధ్యా య ఎన్నికల పోలింగ్ ప్రశాంతగా జరిగింది. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 82వ బూత్‌లో జరిగిన ఓటింగ్‌లో 88.83 శాతంనమోదైంది. మొత్తం 394 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 198 మంది పురుషులు, 152 మంది మహిళా ఉపాధ్యాయ, అధ్యాపకులు 350 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 44 మంది ఓటింగ్‌కు హాజరు కాలేదు. కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ సందర్శించి ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఎ టువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ డి.దీనబందు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అభ్య ర్థుల మద్దతుదారులు ఏర్పాచేసిన శిబిరం వద్ద టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, మాజీ ఎంపీపీ రమణమూర్తి, తెలుగుయువత నేతడప్పోడి వెంకటరమణ, ఉపాధ్యాయ సంఘ నాయకులు జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరకులో..

అరకులోయ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. మండంలో ఎమ్మెల్సీ ఎన్నికలసంబంధించి 134 మంది ఓటర్లకు గాను 117 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 79 మంది కాగా, మహిళలు 38 మంది. మి గిలిన 17 మందిలో ఒకరు ఇటీవల మృతి చెందగా 16 మంది ఓటింగ్‌లో పాల్గోలేదు.. తహసీల్దార్ ఎంవీఎస్ ప్రసాద్, టీడీ గోవిందు,సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే, కూటమి బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మద్దతుగా ఏపీటీఎఫ్ ప్రతినిధులు, కూటమి నేతలు దొన్నుదొర, శెట్టి బాబూరావు, పెదలబుడు సర్పంచి పెట్టెలి దాసుబాబు, మైనారిటీ సెల్ ప్రతినిధి ఎస్.కె.రహమాన్, నాయకులు భూర్జ లక్ష్మి ,కళావతి, ఏపీటీఎఫ్ నేతలుపాల్గొన్నారు. యూటీఎఫ్, సీపీఎం అభ్యర్థి కోరుట్ల విజయగౌరిని బలపరుస్తూ గిరిజన సంఘం నేతలు కిల్లో సురేంద్ర, బాలదేవ్ తదితరులు శిబిరాల్లో పాల్గొన్నారు.

ఎన్నికల సరళిని పరిశీలించిన జేసీ

జి.మాడుగుల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి మండలంలో మొ త్తం 48 ఓట్లు ఉండగా ఇందులో 47 ఓట్లు పోలై, 98 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలింగ్ కేంద్రం (38)ను పాడేరు జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడ పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సరళిపైమాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆరా తీశారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయ ఓటర్లతో ఆమె స్వయంగా ఫోన్లు చేసి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్ నాయుడు, ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు,నాయకులు కొండలరావు, జి.రెడ్డిబాబు, కల్యాణం తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో..

కొయ్యూరు: మండల కేంద్రంలో బూత్ 89లో నిర్వహించిన ఈ పోలింగ్‌లో 161 మంది ఉపాధ్యాయుల ఓటర్లకు గానూ 160 మంది ఉన్నారు. వీరిలో మధ్యాహ్నం 3-30 గంటలకు 142 ఓట్లు పోలైనట్టు తహసీల్దారు తెలిపారు. పోలింగ్ సరళిని తహసీల్దారు ఎస్ఎల్‌వీ ప్రసాద్, ఎంపీడీవో ఎస్‌కేవీ ప్రసాద్ పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వెంకటరమణ, ఎస్ఐ కిశోర్‌వర్మ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అభ్యర్థులు రఘువర్మ, గాదె శ్రీనివాసుల నాయుడులకు మద్దతుదారులు ఓటర్లకు స్లిప్‌లు పంచారు. టీడీపీ నియోజక వర్గ అబ్జర్వరు నారాయణ స్థానిక నేతలతో కలిసి ఓటంగ్ సరళిని పరిశీలించారు.

చింతపల్లిలో 86 శాతం పోలింగ్

చింతపల్లి: మండల కేంద్రంలో 86శాతం ఓటింగ్ జరిగింది. సాయంత్రం నాలుగు గంటల వరకు ఒక్కొక్కరుగా ఉపాధ్యాయులు పో లింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. అలాగే, మండలంలో మొత్తం 186 ఓట్లు ఉండగా, 160మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 50మంది మహిళలు, 110మంది పురుషులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పటిష్ఠ భద్రత: ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

సబ్ డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేసినట్టు స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు. గురువారం అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డిలో కలిసి ఏఎస్పీ చింతపల్లి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి పోలింగ్ కేంద్రాల్లో సజావుగా ఎన్నికలు జరిగాయన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం. వినోద్‌బా బు, ఎస్ఐ వెంకట రమణ పాల్గొన్నారు.కూటమి బలపర్చి ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మెజారిటీ ఓట్లు పడినట్టు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. గురువారం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో పర్యటించిన ఆమె ఎన్నికల సరళిని పరిశీలించి మాటాడారు. టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, పట్టణ అధ్యక్షుడు రీమల ఆనందరావు, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, ఏపీటీఎఫ్ నాయకులు బొండు గంగరాజు, దేపూరి శశి కుమార్ పాల్గొన్నారు.


కొయ్యూరులో పోలింగ్ కేంద్రం వద్ద ఎస్ఐ కిషోర్‌వర్మ,సిబ్బంది బందోబస్తు


చింతపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు


దుంబ్రిగుడలో పర్యవేక్షిస్తున్న ఆర్టీసీ రీజినల్ చైర్మన్ దొన్నుదొర, నాయకులు


ముంచంగిపుట్టులో బ్యాలెట్ బాక్సులను పాడేరు తీసుకువెళ్తున్న ఎన్నికల సిబ్బంది

అనంతగిరిలో..

అనంతగిరి: మండల కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల గురువారం ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. 81 పోలింగ్ బూత్‌లోని 62 మంది ఓటర్లకు గాను, 56 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులోని స్త్రీలు 25 మంది, పురుషులు 31 మంది ఉన్నట్టు అధికారులు తెలిపారు. స్థానిక ఎస్ఐ డి.శ్రీనివాసరావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ మాణిక్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మ గెలుపు తథ్యం: దొన్నుదొర

దుంబ్రిగుడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న రఘువర్మ గెలుపు ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి సన్యాసిరావు, విజయనగరం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర ఆశాభావం వ్యక్తంచేశారు. టీడీపీ, ఏపీటీఎఫ్ నాయకులు ఏర్పాటు చేసిన శిబిరంను వారు సందర్శించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడలో 93 శాతం

స్థానిక ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ఓటింగ్ ఎమ్మెల్సీ ఎన్నిక ఓటింగ్ 93 శాతం నమోదైంది. 77 మందికి గాను 71 మంది ఓటును వినియోగించారు. 20 మంది మహిళ ఉపాధ్యాయినులు, 51 మంది ఉపాధ్యాయులు ఓటును వినియోగించుకున్నారు. స్థానిక ఎస్ఐ పాపినాయుడు నేతృత్వాన గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ముంచంగిపుట్టులో 86 శాతం

ముంచంగిపుట్టు : ముంచంగిపుట్టులో 86శాతం పోలింగ్ జరిగిందని జోనల్ అధికారి వి.మురళి తెలిపారు. మొత్తం 61 మందికి గాను 53 మంది ఓటును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని తహసీల్దార్ నర్సమ్మ పర్యవేక్షించారు. సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను సీల్ వేసి ప్రత్యేక బస్సులో పాడేరు జిల్లా కేంద్రానికి తరలించారు.

జీకేవీధిలో 84శాతం..


వినిఅరకులో ఓటు వేసి వస్తున్న ఉపాధ్యాయిని

గూడెంకొత్తవీధి: ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో 84శాతం పోలింగ్ జరిగినట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. మండలంలో మొత్తం 123ఓటర్లు ఉండగా సాయంత్రానికి 104మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును యోగించుకున్నారు.

ఒంగోలులో గుత్తూరుపుట్టు యువకుడి హత్య?

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని జాతీయ రహదారిపై ఇటీవల లభ్యమైన మృతదేహం వివరాలను ఎ ట్టకేలకు పోలీసులు గుర్తించారు. మృతుడు అల్లూరి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. వివరాలివి.. ఈనెల 16న త్రోవగుంట కంపెనీల వద్ద ఓ యువకుడి మృతదేహం పడి ఉంది. అతని తల వెనుక గాయాలుండటంతో అప్పట్లో పోలీసులు రోడ్డు ప్రమాదంగా భావించారు. అయితే,పోస్టుమార్టం నివేదికలో ప్రమాదం కాదని, ఎవరో బలమైన దెబ్బలు కొట్టడంతో చనిపోయాడని తేలడంతో పోలీసులు కేసు దర్యాప్తులో వేగం పెంచారు. ఎట్టకేలకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మృతుడు అల్లూరి జిల్లా పెదబయలు మండలం గుత్తులపుట్టుకు చెందిన లాకే శివ(30)గా గుర్తించారు. ఈ మేరకు మృతుడిని ఫొటో తన భర్తది శివ భార్య లక్ష్మి నిర్ధారించారు. శివ భార్య లక్ష్మితో కలిసి ఆరునెలల క్రితం కొప్పోలులోని ఇంటూరి సుబ్బారావుకు చెందిన చేపల చెరువుల వద్ద కాపలాదారు పనులకు వచ్చారు. ఆ పక్కనే గణేష్ అనే యువకుడు కూడా ఇదే పని చేస్తున్నాడు. 20 రోజుల క్రితం శివ, గణేష్‌ల మధ్య గొడవ జరిగింది. అనంతరం వారిద్దరూ కలిసిమెలిసి ఉంటూనే తరచూ మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 16న ఇంటూరి సుబ్బారావు శివకు నిత్యావసరాలు కొనుగోలుచేసి ఇచ్చి చెరువు వద్ద వదిలిపెట్టాడు. ఆ తరువాత గణేష్, మరో యువకుడితో వచ్చి శివను బయటకు తీసుకువెళ్లినట్టు శివ భార్య లక్ష్మి చెబుతున్నారు. అప్పటి నుంచి తన భర్త తిరిగి ఇంటికి రాలేదని పోలీసులకు తెలిపారు. ఆమె భర్త స్వ గ్రామం వెళ్లి ఉంటారని భావించి అక్కడికి వెళ్లారు. అనంతరం మృతదేహం రోడ్డుపై పడి ఉండటం, శివదిగా భావించి ఆయన భార్య లక్ష్మిని పోలీసులు పిలిపించారు. ఈ క్రమంలో ఆమె తన భర్త ఫొటోను గుర్తించారు. తన భర్త శివను గణేష్, అతని స్నేహితుడు కలిసి బయటకు తీసుకెళ్లారనేందుకు ప్రత్యక్ష సాక్షి లక్ష్మి. ఆ తరువాత శివ తిరిగి ఇంటికి రాలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో ఒంగోలు తాలుకా పోలీసులు విచారణ చేస్తున్నారు. త్వరలోనే కేసు దర్యాప్తు త్వరలో పూర్తి చేస్తాని ఒంగోలు తాలుకా సీఐ అజయ్‌కుమార్ పేర్కొన్నారు.

కిటకిటలాడిన శైవ క్షేత్రాలు


పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి దర్శనానికి భక్తుల క్యూ

పాడేరురూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయం, స్వయంభూ లింగేశ్వర, త్రిముఖ లింగేశ్వరస్వామి, సంగోడి గ్రామంలోని పార్వతీ సమేత సిద్ధి సంగమేశ్వర స్వామి తదితర ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి సింహాచలం నాయుడుప్రసాదం పంపిణీ చేపట్టారు. పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు ఐ.అనీల్ కుమార్, స్థానిక ఎస్ఐ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పార్వతీ సమేత సిద్ధి సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు.

మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో ఉన్న పార్వతీ సమేత సిద్ధి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన హోమంలో ఎగసి పడ్డ జ్వాళలో పరమశివునితోపాటు పార్వతీదేవి దర్శనం ఇవ్వడం జరిగిందని ఆలయ నిర్వాహకులు బ్రహ్మకుమారీస్ జయతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు చెపుతున్న వీడియోలు గురువారం విస్తృతంగా ప్రచారం అయ్యాయి. హోమం నుంచి వచ్చిన జ్వాళల్లో పార్వతీ, పరమేశ్వరులు దర్శనమిచ్చారు అంటూ భక్తులు ప్రత్యేక పూజలను చేపట్టారు. ఎంతో అద్భుతంగా బావించిన భక్తులు సంగోడి ఆలయం ప్రముఖ శైవక్షేత్రంగా మారుతాదని అంటున్నారు. ఆనందంతో పూజలను చేపట్టారు.

కొయ్యూరు: మండలంలోనిశైవ క్షేత్రాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. కొయ్యూరు మల్లి కార్జున స్వామి, వలసంపేట గిరిజా సమేత తాండవేశ్వర స్వామి, మాకవరం పురాతన శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉత్సవ కమిటీలు అసౌకర్యం కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు.


పాడేరులో పోసానిపై కేసు నమోదు

- గత నవంబరులో ఆయనపై ఫిర్యాదు చేసిన టీడీపీ నేత పాండురంగస్వామి

పాడేరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన అగ్ర నేతలను అకారణంగా దూషించిన వైనాలపై ఆధారాలతో గతేడాది నవంబరు 14న టీడీపీ డివిజన్ నేత పాంగి పాండురంగస్వామి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి కారణాలు లేకుండా టీడీపీ, జనసేన అగ్ర నేతలైన నారా చంద్రబాబునాయుడు, నారా లోకేశ్, పవన్‌కల్యాణ్‌లపై నానా దుర్భాషలాడుతూ వీడియోలు పోస్టు చేస్తున్న పోసాని కృష్ణమురళిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ పాండురంగస్వామి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు గతేడాది నవంబరు 14న ఐపీసీ సెక్షన్లు 153ఏ, 504, 505(2), 67తో పాటు ఐటీ చట్టం 2000- 2008తో పోసానిపై స్థానిక పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. కాగా పోసాని కృష్ణమురళి అరెస్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసులు వెలుగులోకి రావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు సైతం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

గోదావరి డెల్టాకు నీటి విడుదల

సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి


డొంకరాయి నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

సీలేరు, ఫిబ్రవరి 27 , (ఆంధ్రజ్యోతి) : బలిమెల జలాశయం నుంచి 7 వేల క్యూసెక్కుల నీటిని డ్రా చేస్తున్నామని ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గు రువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు సీలేరు నుంచి నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారుల కోరిక మేరకు ఫిబ్రవరి 10 నుంచి డొంకరాయి జలాశయం నుంచి మూడు వేలు క్యూసెక్కులు , పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4300 క్యూసెక్కులు కలసి మొత్తంగా 7300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ వచ్చామన్నారు. డొంకరాయి జలాశయంనుంచి ఫిబ్రవరి 10 నుంచి విద్యుత్ ఉత్పత్తి లేకుండా గోదావరి డెల్టాకు నేరుగా 4.17 టీఎంసీలు విడుదల చేసినట్టు ఆయన వివరించారు.

రోడ్డెక్కిన చెరకు రైతు

... 5వ పేజీ తరువాయి



రైతుల ఆందోళనతో నిలిచిపోయిన వాహనాలు

నిలిచిపోతున్నది. దీంతో ఫ్యాక్టరీ యార్డులో, కాటాల వద్ద చెరకు బండ్లు, ట్రాక్టర్లు రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. ఫ్యా క్టరీ యాజ మాన్యం తీరుపై రైతులు ఆందో ళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బుధ వారం సాయంత్రం ఆరు గంటల సమయంలో టర్బయిన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యతో మరోసారి క్రషింగ్ నిలిచిపోయింది. ఫ్యాక్టరీ యార్డులో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో చెరకు తీసుకువచ్చిన రైతులు రాంత్రంగా జాగారం చేయాల్సి వచ్చింది. గురువారం ఉదయానికి కూడా క్రషింగ్‌ను పునరుద్ధరించకపోవడంతో రైతుల్లో సహనం నశించింది. తొమ్మిది గంటల సమయంలో ఫ్యాక్టరీ ఎదుట అనకాపల్లి-చోడవరం ప్రధాన రహదారిపైకి వచ్చి ఆందోళనకు దిగారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక సీఐ అప్పలరాజు, ఎస్ఐలు గోవాడ చేరుకుని రైతులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. క్రషింగ్ అవాంతరాలపై ఫ్యాక్టరీ ఎండీ, ఇతర అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని, అంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడం, మరోవైపు పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడుతుండడంతో పోలీసులు ఫ్యాక్టరీలోకి వెళ్లి ఎండీ సన్యాసినాయుడుని వెంటబెట్టుకుని వచ్చారు.సాంకేతిక కారణాల వల్ల క్రషింగ్ ఆగిందని, పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నామని ఎంపీ వివరణ ఇచ్చారు. ఆయన సమాధానంతో సంతృప్తి చెందని రైతులు ఆగ్రహంతో ఎండీతోపాటు ఇతర అధికారులపైకి దూసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అధికారులు ఫ్యాక్టరీలోకి పరుగులు తీశారు. వారిని వెంబడిస్తున్న రైతులను పోలీసులు నిలువరించి, చెరకు క్రషింగ్‌ను త్వరగా పునరుద్ధరించేలా చూస్తామని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరిమించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రైతుల ఆందోళన కారణంగా సుమారు మూడున్నర గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది.

20 గంటల తరువాత క్రషింగ్ పునరుద్ధరణ

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో తలెత్తిన సాంకే తిక అవాంతరాలను సరిదిద్దిన అధికారులు గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు క్రషింగ్‌ను పునరుద్ధరించారు. వాస్తవంగా టర్బయిన్‌లో సమస్యల కారణంగా మంగళవారం క్రషింగ్ ఆగిపోయింది. సమస్యను సరిదిద్ది బుధవారం ఉదయం తిరిగి ప్రారంభించారు. బగాస్ కొరత కారణంగా సాయంత్రం క్రషింగ్ నిలిచిపోయింది.

అనకాపల్లి ఆర్డీవో విచారణ

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిచిపోవడం, చెరకు రైతులు ఆందోళన చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అనకాపల్లి ఆర్డీవో ఆయిషా గురువారం మధ్యాహ్నం షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. పరిస్థితిని పరిశీలించి క్రషింగ్ అంతరాయాలు, ఇతర సమస్యలపై ఎండీతో చర్చించారు. అనంతరం యార్డులో ఉన్న చెరకు రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రషింగ్ తరచూ ఆగిపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు రైతులు ఆర్డీవోకు చెప్పారు. ఆమె తహసీల్దార్ అంబటి రామారావు, రెవెన్యూ సిబ్బంది వున్నారు.

జిల్లాలో 96.22 శాతం పోలింగ్


కంట్రోల్ రూమ్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

... 5వ పేజీ తరువాయి

సత్యనారాయణరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనంలో విశాఖలోని స్ట్రాంగ్‌రూమ్‌కి తరలించారు.

కలెక్టరేట్ నుంచి పోలింగ్ సరళి పరిశీలన

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. పోలింగ్‌తోపాటు గంట గంటకు నమోదైన పోలింగ్ శాతాన్ని వెబ్‌కాస్టింగ్ ద్వారా తెలుసుకున్నారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు డీఆర్‌వో సత్యనారాయణరావు కంట్రోల్ రూమ్‌లోనే వుండి పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం: ఎస్పీ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ తుహిన్‌సిన్హా చెప్పారు. అనకాపల్లిలోని జీవీఎంసీ ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగిందని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పటిష్ఠంగా అమలు చేసినట్టు ఆయన చెప్పారు.


అనకాపల్లి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో


సబ్బవరంలో పోలింగ్ సరళిని గమనిస్తున్న పంచకర్ల రమేష్‌బాబు, గండి బాబ్జీ


కశింకోట పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్‌లో కూటమి నేతలు


పరవాడ బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు

ఓటేసిన గురువులు

- అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఉదయం ఏడున్నరకే ఓటు వేసేందుకు క్యూ
- భారీ ఏర్పాట్లు చేపట్టిన అధికారులు
- పరిస్థితులను సమీక్షించిన జిల్లా ఎస్పీ


కశింకోటలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలోని జీవీఎంసీ ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. ఇక్కడ 582 మంది ఓటర్లకు గాను 555 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు సైతం పోలింగ్ కేంద్రానికి కుటుంబ సభ్యుల సహకారంతో వచ్చి ఓటు వేశారు. పోలింగ్ ప్రారంభ దశలో దివ్యాంగులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు వీల్‌చైర్ లేకపోవడంతో ఓ దివ్యాంగురాలు అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి కొద్దిసేపటికే పోలింగ్ కేంద్రంలో వీల్‌చైర్ ఏర్పాటు చేయడంతో ఆమెను పోలీసులు, ఆశ కార్యకర్త వీల్‌చైర్‌లో తీసుకు వెళ్లి ఓటు వేసే విధంగా సహకరించారు. పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ ఎం.శ్రావణి, ఆర్డీవో షేక్ ఆయీషా పరిశీలించారు. ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మకు కూటమి నేతలు మద్దతుగా నిలిచి ప్రత్యేక టెంట్ వేసి ఓటర్లను ఆహ్వానించారు. జనసేన ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ఆధ్వర్యంలో కూటమి నాయకులు టెంట్‌లో కూర్చున్నారు. అలాగే పీఆర్‌టీయూ నాయకులు, పీడీఎఫ్ నాయకులు కూడా వేర్వేరు టెంట్ల ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను ఆహ్వానించారు. ఉపాధ్యాయుడైన హాస్యనటుడు సత్తిపండు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు డి.ఈశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


అనకాపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటరు ఐడీలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా




అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయుడు, దివ్యాంగురాలైన ఉపాధ్యాయురాలును ఓటు వేసేందుకు అనకాపల్లి కేంద్రానికి తెస్తున్న ఎన్నికల సిబ్బంది


అనకాపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

కశింకోటలో...

కశింకోట : మండల కేంద్రం కశింకోటలోని నంబర్-2 పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఇక్కడ 84 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం పది గంటలకు 28 మంది, మధ్యాహ్నం పన్నెండు గంటలకు 73 మంది, రెండు గంటల సమయానికి 81 మంది, సాయంత్రం నాలుగు గంటలకు 83 మంది ఉపాధ్యాయులు ఓటు వేశారు. వీటిలో ఒకటి డబుల్ ఎంట్రీ అయ్యింది. ఇదిలావుంటే, ఎన్నికల కేంద్రాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ ఎం. శ్రావణి సందర్శించారు.

పరవాడలో...

పరవాడ : ఇక్కడి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఈ కేంద్రంలో మొత్తం 84మంది ఓటర్లు ఉండగా, పురుషులు 32, స్త్రీలు 52 మంది మొత్తం 80 మంది తమ ఓటును వినియోగించుకున్నారని పోలింగ్ ఆఫీసర్ రాధాకృష్ణ తెలిపారు. కాగా, పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సబ్బవరంలో...

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం ఎంపీపీ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 94 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా, 93 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి రామ్మోహన రావు తెలిపారు. కూటమి మద్దతుతో పాకలపాటి రఘువర్మ ఎన్నికల బరిలో నిలవడంతో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ కూటమి ఏర్పాటు చేసిన శిబిరంలో కూర్చొని పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి మద్దతు ఇస్తున్న రఘువర్మ విజయం తథ్యమని పేర్కొన్నారు.

'రోటరీ క్లబ్ సేవలు మరింత విస్తృతం'


సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయనున్నామని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మళ్ల వెంకటేశ్వరరావు తెలి పారు. గురువారం రాత్రి ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా ఏడు అంశాలపై మరింత లోతుగా పనిచేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ప్రపంచ శాంతి నిర్వహణలో భాగంగా ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున శాంతి స్తూపాలు ఏర్పాటు చేయాలని, ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేయాలని, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారణకు వ్యాక్సినేషన్ పెద్ద ఎత్తున చేపట్టాలని నిర్ణయించినట్టు చెప్పారు. తల్లిపాల నిధి పలుచోట్ల ఏర్పాటు చేయడం జరుగుతుని, త్వరలో కేజీహెచ్‌లో కూడా ఈ నిధి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అనకాపల్లి శాఖ అధ్యక్షుడు నడిపల్లి రాజేష్, కార్యదర్శి అనిల్, బుద్ద రమణాజీ, కాండ్రేగుల మురళీకృష్ణ, బుద్ద రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి


ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్థంతిని గురువారం నిర్వహించారు. అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అం బేడ్కర్ సేవా సమితి జిల్లా కో-ఆర్డినేటర్ బండి అప్పా రావు, శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి కన్వీనర్ కొణతాల హరినాథబాబు, దిలీప్, ఆజాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

- పరవాడ ఊటగెడ్డ జంక్షన్ నుంచి ఎన్టీపీసీకి వెళ్లే రహదారిపై మొరాయించిన బొగ్గు లారీ
- సుమారు గంటకు పైగా ఇబ్బందులు పడిన వాహనదారులు
- పోలీసులు రంగ ప్రవేశం చేసి క్రమబద్ధీకరణ


రహదారిపై భారీగా నిలిచిపోయిన వానాలు

పరవాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి-గాజువాక ప్రధాన రహదారిలోని పరవాడ ఊటగెడ్డ జంక్షన్ నుంచి అటు ఎన్టీపీసీ, ఇటు పరవాడ పైడిమాంబ ఆలయం వరకు గురువారం వాహనాలు నిలిచిపోయాయి. సుమారు గంటకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. ఊటగెడ్డ జంక్షన్ నుంచి ఎన్టీపీసీ వెళ్లే రహదారిపై మలుపు వద్ద బొగ్గు లారీ మొరాయించడంతో ఈ సమస్య తలెత్తింది. దీనికితోడు ముత్యాలమ్మ తీరానికి వెళ్లే భక్తులు అదే రహదారి గుండా రాకపోకలు సాగించాల్సి ఉంది. ఎక్కువ సంఖ్యలో భక్తులు వాహనాలపై రాకపోకలు జరపడం వలన ట్రాఫిక్ సమస్య జఠిలమైంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

భక్తితో జాగరణ.. జంగమయ్యకు ఆరాధన

- ఘనంగా శివరాత్రి ఉత్సవాలు
- తెల్లవార్లూ శివనామస్మరణ
- వేకువజామున సముద్రం, నదులు, చెరువుల్లో స్నానాలు చేసి పూజలు


పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


సబ్బవరం మండలం దేవీపురం దక్షవటిలో పూజలు

పరవాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరం గురువారం భక్తజనంతో పోటెత్తింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని పుణ్యస్నానాలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో తీరం కోలాహలంగా మారింది. చిన్నా పెద్ద అన్న తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ సముద్రంలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం తీరంలో కొలువైన శివుని దర్శించుకున్నారు. నిర్వాహకులు ప్రసాదాలతో పాటు వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని పరవాడ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేశారు. అలాగే ముత్యాలమ్మ జంక్షన్ నుంచి తీరానికి వచ్చే రహదారిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ నిర్వహించారు. ఇదిలావుంటే, తీరానికి వచ్చే భక్తుల వాహనాలను స్థానిక ముత్యాలమ్మతల్లి ఆలయం వద్దే నిలుపుదల చేయించారు. అక్కడి నుంచి కాలినడకన తీరానికి చేరుకోవాలని చెప్పడంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తీరంలోని శివాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, ఆలయ ధర్మకర్త బొంది అచ్చిబాబు, స్థానిక నాయకులు కోన రామారావు, బూస అప్పలరాజు, కె.దేవి సాంబ, పల్లా అప్పారావు తదితరులు పూజలు జరిపారు. ఇదిలావుంటే, పుణ్యస్నానాల కోసం వచ్చేవారికి తీరంలో ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మునుపెన్నడూ లేని విధంగా భక్తుల రాకతో తీరం కిక్కిరిసిపోయింది. ముత్యాలమ్మపాలెం జంక్షన్ నుంచి తీరానికి వెళ్లే రహదారి రద్దీగా మారింది. రాకపోకలు సాగించే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు నానా అవస్థలు పడ్డారు.

అనకాపల్లి టౌన్ : శివరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. అనకాపల్లి పట్టణ ప్రజలు బుధవారం రాత్రంతా జాగరణ చేశారు. శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని అర్చకులు అత్యంత వైభవోపేతంగా జరిపారు. గవరపాలెం దిబ్బవీధి నాగేంద్రస్వామి ఆలయం వద్ద కల్యాణాన్ని తిలకించేందుకు భారీగా భక్తజనం తరలివచ్చారు.

సబ్బవరం : మహా శివరాత్రి జాగరణ చేసిన భక్తులు గురువారం ఉదయం శివాలయాలకు భారీగా తరలి వచ్చారు. మండలంలోని దేవీపురం దక్షవటి, ఇరువాడ భీమలింగేశ్వరస్వామి, పెదయాతపాలెం ద్వాదశ జ్యోతిర్లింగ, లింగాలతిరుగుడు, వంగలి సోమలింగేశ్వరస్వామి, సబ్బవరం రామలింగేశ్వర స్వామి, గణపతిపురం మల్లికార్జునస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గురుపత్ని అన్నపూర్ణమ్మ, శరగడం శంకరరావు, గొర్లి అచ్చింనాయుడు ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామ రాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. గురువారం పెద్ద ఎత్తున అన్నసమారాధన జరిపారు. బీజేపీ నాయకుడు కోరుకొండ జగదీష్ ప్రారంభించారు. కార్పెంటర్ల సంఘం శాశ్వత గౌరవాధ్యక్షులు కోసూరి మన్మథరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి తుంపాల సతీష్, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధా నకార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

- పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించాలి
- డీఈవో అప్పారావునాయుడు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలోని అన్ని యాజ మాన్య పాఠశాలల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు కోరారు. ఇందులో భాగంగా అన్ని పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, భౌతిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతీసుకొని విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. సైన్స్ ల్యాబ్‌లో ఉన్న సామగ్రిని ప్రదర్శించడంతో పాటు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల వివరాలను జిల్లా విద్యాశాఖాధి కార్యాలయానికి అందజేయాలన్నారు.

పరిమితికి మించి రాయి, పిక్క తరలిస్తున్న రెండు లారీలకు భారీగా జరిమానా

కొత్తూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పరిమితికి మించి క్వారీ రాయి, పిక్క తరలిస్తున్న రెండు లారీలపై జరిమానా విధించినట్టు అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ జి.రవికుమార్ తెలిపారు. బొజ్జన్నకొండ వద్ద బుధవారం సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా అదే మార్గంలో ఓవర్ లోడుతో పిక్క, క్వారీ రాయితో వస్తున్న లారీలను అదుపులోకి తీసుకొని ఆర్టీవోకు అప్పగించామన్నారు. ఈ మేరకు ఒక లారీకి రూ.74వేలు, మరో లారీకి రూ.64వేలు జరిమానా విధించారన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : సిరసపల్లి గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ మహిళను అదుపులోకి తీసుకుని, ఆమెనుంచి 22 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై.లక్ష్మీనాయుడు తెలిపారు.

గుళ్లాట ఆడుతున్న వ్యక్తి అరెస్టు

కొత్తూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు నర్సింగరావుపేట శివారున గుళ్లాట ఆడుతున్న వ్యక్తి అరెస్టు చేసినట్టు అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ జి.రవికుమార్ తెలిపారు. గురువారం ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. మడక నూకరాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, ఆయన వద్ద నుంచి రూ.1,650 నగదు, గుళ్లాటకు సంబంధించి సామగ్రిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

నేడు భ్రమరాంబిక మల్లికార్జున ఆలయ వార్షికోత్సవం

సబ్బవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు పెదనాయుడుపాలెం సమీపంలోని గణపతిపురంలో భ్రమరాంబిక మల్లి కార్జున ఆలయ వార్షికోత్సవం శుక్రవారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. స్వామి, అమ్మవారి కల్యాణాన్ని కన్నుల పండువగా జరపనున్నామన్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం సెక్షన్ పరిధి నర్సింగబిల్లి సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నర్సింగబిల్లి, జె.తుని, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమ్మాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్‌పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, గొల్లగుంట, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : ఇక్కడి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామీణ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ గ్రామాలకు అసౌకర్యం కలగనుందన్నారు.